చెయ్యి పట్టుకోలే.. నాడి చూసిన

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులపై బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులపై బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్ బుకాయింపు వ్యాఖ్యలు చేశారు. తాను లైంగిక ఉద్దేశంతో మహిళా రెజ్లర్ల చేయి పట్టుకోలేదని, కేవలం పల్స్ చెక్ చేశానని సోమవారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టుకు తెలిపారు. 'సందర్భం లేకుండా నేను వారి శ్వాసక్రియను ఎందుకు చెక్ చేస్తాను. నేను వారిని లైంగికంగా వేధించాలనుకొని ఉంటే వారి కడుపును తాకి శ్వాసక్రియను పరిశీలించేవాడిని' అని చెప్పుకొచ్చారు. ఆయన తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ బ్రిజ్‌భూషణ్ కేవలం పల్స్ రేట్ చెక్ చేశారని తెలిపారు. ఓవర్‌సైట్ కమిటీ ఏర్పాటుకు ముందు బ్రిజ్‌భూషణ్‌పై ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. కేవలం ట్వీట్ల ఆధారంగా కమిటీ విచారణ చేసిందన్నారు. తదుపరి విచారణను 19కి కోర్టు వాయిదా వేసింది.

అవన్నీ నిరాధార ఆరోపణలు: సిద్ధరామయ్య

బెంగళూరు: కాంట్రాక్టర్ల నుంచి కోట్ల రూపాయల్ని పోగేస్తున్నదని కర్ణాటకలోని అధికార కాంగ్రెస్‌పై వచ్చిన ఆరోపణల్ని ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య కొట్టిపారేశారు. ఐటీ దాడులు ఎదుర్కొన్న కాంట్రాక్టర్లకు కాంగ్రెస్‌కు సంబంధం ఉందంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, ఇవన్నీ రాజకీయ ప్రేరేపితమని విలేకర్ల సమావేశంలో సీఎం చెప్పుకొచ్చారు. పార్టీ అధిష్టానం తమను ఒక్క రూపాయి కూడా అడగలేదన్నారు. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఓట్లను దండుకోవడానికి కాంగ్రెస్ అధిష్టానం కర్ణాటక కాంగ్రెస్‌కు టార్గెట్ పెట్టిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల ఆ రాష్ట్రంలో కాంట్రాక్టర్లపై జరిగిన ఐటీ దాడుల్లో కోట్ల రూపాయల నగదు కట్టలు బయటపడటం సంచలనం రేపింది. మరోవైపు, కర్ణాటకలో పట్టుబడ్డ నోట్లకట్టలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్ష బీజేపీ డిమాండ్ చేసింది.

హైదరాబాద్ విమానాశ్రయం బెస్ట్

సమయపాలనలో మూడో స్థానం

న్యూఢిల్లీ: సమయపాలనలో హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ విమానాశ్రయం ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచింది. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి ర్యాంకును కైవసం చేసుకున్నట్టు వైమానిక విశ్లేషణ సంస్థ సర్క్యూమ్ వెల్లడించింది. అమెరికా ఉటాలోని సాల్ట్ లేక్ అంతర్జాతీయ విమానాశ్రయం రెండో స్థానంలో నిలువగా, మిన్నెసోటాలోని మినియాపోలిస్-సెయింట్ పాల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నాలుగో స్థానంలో, కొలంబియాలోని ఎల్ డొరాడో ఎయిర్‌పోర్టు ఐదో స్థానంలో నిలిచాయి.

6జీ అభివృద్ధిలో చైనా ముందడుగు

న్యూఢిల్లీ: 6జీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడంలో చైనా ముందడుగు వేసింది. ఇందుకు సంబంధించిన శాటిలైట్ డివైజ్‌ను విజయవంతంగా పరీక్షించినట్టు తెలిపింది. ఈ పరికరం ద్వారా కాంతి సిగ్నళ్లను ఎలక్ట్రికల్ సిగ్నళ్లుగా మార్చకుండానే ఒక స్థానం నుంచి మరో స్థానానికి పంపించగలిగినట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ శాటిలైట్ డివైజ్‌ను ఈ ఆగస్టులో కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.

ఊసరవెల్లి కాంగ్రెస్!

ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా హామీలు

ఓట్ల కోసం పొంతన లేని మాటలు

- మిజోరంలో పింఛను 2,500.. అదే తెలంగాణలో 4 వేలు అంట!
- సిలిండర్ విషయంలోనూ అదే తీరు
- ఆరోగ్య బీమాపైనా భారీ వ్యత్యాసం
- అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మరో విధంగా పథకాల అమలు తీరు
- చిత్తశుద్ధి లేని కాంగ్రెస్‌పై విమర్శలు



హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ మార్చుతున్న రోజుకో రంగును చూసి ఊసరవెల్లి కూడా బిత్తరపోతుంది. తనకు పోటీగా, తన కంటే ఎక్కువగా రంగులు మారుస్తున్న కాంగ్రెస్ అంటే ఊసరవెల్లికి కూడా కంపరమెత్తుతుందేమో అనిపిస్తున్నది ఆ పార్టీ విధానాలు చూస్తుంటే! ఒక పార్టీ అన్న తర్వాత.. అది కూడా జాతీయ పార్టీకి ఏ రాష్ట్రంలోనైనా ఒకే పాలసీ ఉండాలి. అయితే పూటకో మాట.. రాష్ట్రానికో హామీ అన్నట్టుగా, నవ్విపోదురుగాక నాకేమి సిగ్గు అనే విధంగా అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఇస్తున్న హామీల తీరు ఉన్నది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వ్యవహరిస్తూ, ఒకే పథకంపై రకరకాలుగా ప్రకటనలు చేస్తూ ఊరసవెల్లి నైజాన్ని బయటపెట్టుకొంటున్నది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పింఛన్లు, వంట గ్యాస్ సిలిండర్, తదితర హామీలపై ఎన్నికల రాష్ట్రాల్లో ఒకదానితో ఒకటి పొంతన లేకుండా హామీలు ఇస్తున్నది. ఇదే సమయంలో తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ పథకాలు మరోలా ఉన్నాయి. దీన్ని చూస్తుంటే ఎన్నికల్లో ఓట్ల యావ తప్ప.. ప్రజలకు మంచి చేయాలని, వారికి సంక్షేమం అందించేలానే చిత్తశుద్ధి ఇసుమంతైనా కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధానం

తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతుండటంతో.. కాంగ్రెస్ పార్టీ ఒకే పథకాన్ని ఒక్కో రాష్ట్రంలో రకరకాలుగా ప్రకటిస్తున్నది. తెలంగాణలో పింఛను రూ.4,000 ఇస్తామని మ్యానిఫెస్టోలో చెప్పుకొచ్చిన ఆ పార్టీ.. మిజోరంలో ఆ హామీని రూ.2,500లతో సరిపెట్టింది. అలాగే తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకే ఇస్తామని ప్రకటించిన హస్తం పార్టీ.. మిజోరంలో మాత్రం రూ.750కి ఇస్తామంటూ సాక్షాత్తూ ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించడం గమనార్హం. అంతే కాకుండా తెలంగాణలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజలకు రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య బీమా ఇస్తామని ప్రకటనలు చేస్తున్న కాంగ్రెస్.. మంగళవారం మధ్యప్రదేశ్‌లో మ్యానిఫెస్టో విడుదల చేస్తూ అక్కడి ప్రజలకు రూ.25 లక్షల ఆరోగ్య బీమాను ప్రకటించడం అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తున్నది. అలాగే తెలంగాణలో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని అంటున్న కాంగ్రెస్.. మధ్యప్రదేశ్‌లో మాత్రం రూ.1,500లే ఇస్తామంటూ ప్రకటించింది.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనూ అలానే..

పోనీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనైనా ఒకే విధానం ఉందా అంటే అదీలేదు. ఊరికో మాట.. పథకానికో రంగు లాగా ఉంది పరిస్థితి. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వమే పాలిస్తున్నది. తాజాగా కర్ణాటకలోనూ కాంగ్రెస్సే అధికారంలోకి వచ్చింది. అక్కడ మరో రకంగా ఈ పథకాలు ఉన్నాయి. రాజస్థాన్‌లో ప్రస్తుతం 60 ఏండ్లు నిండిన వారికి నెలకు పింఛను రూ.750 మాత్రమే ఇస్తున్నారు. 80 ఏండ్లు నిండిన వారికి మాత్రం రూ.1000 ఇస్తున్నారు. కర్ణాటకలో మరోలా అమలు చేస్తున్నారు. అక్కడ 60 నుంచి 64 ఏండ్ల వారికి నెలకు రూ.600, 65 ఏండ్ల నుంచి 80 ఏండ్ల మధ్య వారికి రూ.వెయ్యి, 80 ఏండ్లకు పైబడిన వారికి రూ.1,200 పింఛనుగా ఇస్తున్నారు. కర్ణాటకలో వితంతు, దివ్యాంగుల పింఛను విషయంలో కాంగ్రెస్ పార్టీ ఊసరవెల్లినే మైమరిపిస్తున్నది. పిల్లలు లేని వితంతువుకు నెలకు రూ.600, పిల్లలు ఉన్న వితంతువులకు రూ.800 చొప్పున కనికరిస్తున్నారు. దివ్యాంగుల విషయానికి వచ్చేసరికి 40 శాతం వైకల్యం ఉంటే నెలకు రూ.800 ఇస్తుండగా.. అదే 75 శాతం వైకల్యముంటే రూ.1,600 ఇస్తున్నారు.

పారదర్శకతకు పాతర

- కీలక సంస్థలపై మోదీ ఉక్కుపిడికిలి
- సమర్థంగా పనిచేయలేకపోతున్న కాగ్
- 55 నుంచి 14కు తగ్గిన నివేదికలు
- డిఫెన్స్ ఆడిట్ రిపోర్టులు 'సున్నా'

న్యూఢిల్లీ : దేశంలోని కీలక సంస్థలపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఉక్కుపిడికిలి బిగిస్తున్నారు. ఆయా సంస్థల పారదర్శకతకు నిలువునా పాతరేస్తున్నారు. అందుకు దేశ అత్యున్నత ఆడిట్ సంస్థ కాగ్ పనితీరే ప్రత్యక్ష నిదర్శనం. కేంద్రంలో మోదీ అధికార పగ్గాలు చేపట్టిన నాటినుంచి కాగ్ సమర్థంగా పనిచేయడం లేదు. 2015లో కాగ్ మొత్తం 55 నివేదికలను సమర్పించగా.. వాటి సంఖ్య 2015లో 42కు, 2017లో 45కు, 2018లో 23కు, 2019లో 21కి తగ్గింది. 2020లో ఏకంగా 75 శాతం క్షీణించి 14కు దిగజారింది. 2017లో ఏడుగా ఉన్న డిఫెన్స్ ఆడిట్ నివేదికలు 2020లో 'సున్నా'కు పడిపోయాయి. స్వతంత్రంగా పనిచేయాలని కోరుకునేవారిని, ప్రయత్నించేవారిని శిక్షిస్తున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాగ్ 12 నివేదికలను సమర్పించింది.ఆ నివేదికల రూపకల్పనకు బాధ్యులైన కాగ్ అధికారులను కొద్ది రోజులకే బదిలీ చేశారు.

300 కోట్ల స్వాహాను బయటపెట్టినందుకు..

బదిలీకి గురైన కాగ్ అధికారుల్లో దత్తప్రసాద్ సూర్యకాంత్ శిర్సత్ ఒకరు. ఆయుష్మాన్ భారత్-ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకం పనితీరు ఆడిటింగ్‌కు ఇంచార్జిగా వ్యవహరించిన ఆయన దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల్లోని 161 జిల్లాల్లో 964 దవాఖానలను ఆడిట్ చేశారు. మరణించిన వారు, నకిలీ లబ్ధిదారుల పేరుతో క్లెయిములు చేసి ఏకంగా రూ.300 కోట్లకుపైగా నిధులు స్వాహా చేశారని తేల్చడమే శిర్సత్ చేసిన 'పాపం'.

ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలో భారీ మాయ

బదిలీ వేటుకు గురైన మరో అధికారి అతూర్వ సిన్హా. హైవే ప్రాజెక్టులను ఆయన ఆడిట్ చేశారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు వ్యయం అంచనా కంటే ఎన్నో రెట్లు భారీగా పెరిగినట్టు సిన్హా తన నివేదికలో నిగ్గు తేల్చడంతో ఆయనను బదిలీ చేశారు.

దిగ్విజయ్ బట్టలు చింపండి!

- టికెట్ దక్కని నేతల అనుచరులను ఉసిగొల్పిన మాజీ సీఎం కమల్‌నాథ్
- పెద్దలకు వివేకం ఉండాలన్న దిగ్విజయ్
- మధ్యప్రదేశ్ కాంగ్రెస్‌లో విభేదాలు
- టికెట్లపై పార్టీలో పంచాయితీ

భోపాల్, అక్టోబర్ 17: తెలంగాణతో పాటు వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీలో టికెట్ల పంచాయితీ కొనసాగుతున్నది. టికెట్ దక్కని ఆశావహుల మద్దతుదారులు పలుచోట్ల ఆందోళనలకు దిగుతున్నారు. తాజాగా మధ్యప్రదేశ్ కాంగ్రెస్‌లో నెలకొన్న టికెట్ పంచాయితీకి సంబంధించి ఒక వీడియో వైరల్‌గా మారింది. రాష్ట్రంలోని శివపురి నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ వీరేంద్ర రఘువంశి మద్దతుదారులు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం కమల్‌నాథ్ ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కమల్‌నాథ్ మాట్లాడుతూ 'వెళ్లి పార్టీ సీనియర్ నేతలైన దిగ్విజయ్ సింగ్, జయవర్ధన్ సింగ్ బట్టలు చింపి.. మీ నిరసన తెలుపండి' అంటూ ఉసిగొల్పారు. వీరేంద్రకు టికెట్ దక్కాలని తాను కోరుకుంటున్నానని అనడం వీడియోలో ఉన్నది.

ఆ వివేకం ఉండాలి..

ఈ వీడియో రాష్ట్ర రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కమల్‌నాథ్ వ్యాఖ్యలపై మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ తీవ్రంగానే స్పందించారు. ఒక కుటుంబం పెద్దది అయినప్పుడు ఉమ్మడి సంతోషాలు, విభేదాలు ఉంటాయని మంగళవారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. పెద్దలు విభేదాలను ఓపిగ్గా పరిష్కరించుకోవాలని వివేకం చెబుతుందంటూ కమల్‌నాథ్‌ను ఉద్దేశించి చురకలంటించారు.

తెలంగాణలో బీజేపీని ఓడిస్తాం: రాహుల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: రోజురోజుకు మసకబారుతున్న కాంగ్రెస్ పరిస్థితి చూసో లేదా వరుస ఓటములతో డీలాపడటంతోనే ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఏదేదో మాట్లాడుతున్నారు. మొన్నటికి మొన్న తమ పార్టీ అధికారంలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లోనూ కాంగ్రెస్ ఓటమి ఖాయమంటూ వ్యాఖ్యానించి తమ పార్టీ ఓటమిని డిసైడ్ చేసేసిన ఆయన.. తాజాగా మరోసారి నాలుకర్చుకొన్నారు. ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడించామని చెబుతూ.. అదే ఊపులో తెలంగాణలో కూడా అసలు అధికారంలో లేని కమలం పార్టీని ఓడిస్తామంటూ ప్రగల్భాలు పలికారు. వచ్చే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో తమదే విజయమంటూ నేలవిడిచి కర్రసాము చేసినట్టుగా ఆయన గొప్పలకు పోయారు. 'కర్ణాటకలో బీజేపీని ఓడించాం. అదే మాదిరి తెలంగాణలో కూడా బీజేపీని మట్టికరిపిస్తాం. మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీని అంతం చేస్తాం. ఛత్తీస్‌గఢ్‌లో చిత్తు చేస్తాం. గత ఎన్నికల్లో రాజస్థాన్‌ను ఓడించి అధికారంలోకి వచ్చాం. మళ్లీ దానినే పునరావృతం చేస్తాం. ఈశాన్యంలో కూడా ఇదే ప్రణాళిక అమలు చేస్తాం. కాంగ్రెస్ ఆలోచనలను తక్కువగా అంచనా వేయొద్దు' అని చెప్పుకొచ్చారు.

ప్రజా భద్రతలో దుబాయ్ పోలీసులు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. పూర్తి స్థాయి ఎలక్ట్రిక్, సెల్ఫ్ డ్రైవింగ్ కార్లను నివాస ప్రాంతాల్లో గస్తీకి ఉపయోగించాలని ప్రయత్నిస్తున్నారు. ఈ కార్లు కృత్రిమ మేధాశక్తితో పని చేస్తాయి.

సైన్యంతో కేంద్రం పబ్లిసిటీ!

- దేశవ్యాప్తంగా 822 సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు
- వీటి ద్వారా కేంద్ర సంక్షేమ పథకాల ప్రచారం
- సైన్యానికి నరేంద్ర మోదీ సర్కారు ఆదేశాలు
- మీ పబ్లిసిటీ కోసం సైన్యాన్ని వాడుకుంటారా?
- కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: తమ పబ్లిసిటీ కోసం కేంద్రంలోని మోదీ సర్కారు సైన్యాన్ని కూడా వదిలిపెట్టట్లేదు. దేశవ్యాప్తంగా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటుచేసి, వాటి ద్వారా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలని సైన్యానికి బీజేపీ సర్కారు ఆదేశాలు జారీచేయడం వివాదాస్పదంగా మారింది. 9 నగరాల్లో ఈ సెల్ఫీ పాయింట్స్‌ను ఏర్పాటుచేయనున్నట్టు రక్షణ శాఖ వెల్లడించింది. డీఆర్‌డీవో, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ సైతం ఇందులో భాగస్వామ్యం కానున్నట్టు ఈ అంశంతో సంబంధమున్న కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రధాని మోదీ ఫొటోతో పాటు, ఉజ్వల్ యోజన, ఆత్మనిర్భర్ భారత్.. మొదలైన కేంద్ర పథకాల్ని ప్రజలకు తెలియజేసేలా ఈ సెల్ఫీ పాయింట్స్‌ను కేంద్రం ఏర్పాటు చేస్తున్నది. ఇందులో రక్షణ శాఖ 822 సెల్ఫీ పాయింట్స్‌ను తీసుకురానున్నది. వీటిలో సైన్యం- 100, ఎయిర్‌ఫోర్స్-75, నేవీ-75, డీఆర్‌డీవో-50, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్-50, సైనిక్‌స్కూల్-50, మిగతా రక్షణ విభాగాలు 422 సెల్ఫీ పాయింట్స్‌ను ఏర్పాటుచేస్తాయని కేంద్రం తెలిపింది.

75 ఏండ్లలో ఎన్నడూ చూడలేదు..

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై విపక్షాలు మండిపడుతున్నాయి. దేశానికి రక్షణ కల్పించే సైనికుల ధైర్యసాహసాలను, పేరు ప్రఖ్యాతలను ప్రధాని మోదీ తన రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. గత 75 ఏండ్లలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని విమర్శించారు.

5 గంటల కరెంటు ఇస్తం..

IV పేజీ తరువాయి...

ఉన్నతాధికారులతో, ప్రభుత్వ పెద్దలతో కీలక సమావేశాలు నిర్వహించారు. కరెంటు కోతలకు సంబంధించి కీలకమైన ప్రకటన చేస్తున్నట్టు ఆర్భాటంగా ప్రకటించారు. చివరగా మంగళవారం అధికారులతో భేటీ అనంతరం మీడియా ముందుకు వచ్చారు. 'వ్యవసాయానికి నిరంతరాయంగా 5 గంటల పాటు కరెంటును ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నాం' అంటూ ఆర్భాటంగా ప్రకటించారు. ఉదయం లేదా సాయంత్రం లేదా రాత్రి ఇలా షిఫ్టుల వారీగా విద్యుత్తు సరఫరా ఉంటుందని వెల్లడించారు. ఈ విషయాన్ని పత్రికలు, టీవీలు, రేడియోల ద్వారా రైతులకు తెలియజేస్తామన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు ఎంతో ఉపశమనం లభిస్తుందంటూనే తామేదో గొప్ప ప్రకటన చేసినట్టు మంత్రి గప్పాలకు పోయారు. తీరా.. ఈ ప్రకటన చూసిన జనం నవ్వుకొంటున్నారు. 'కొండంత రాగం తీసి.. కూసంత పాటపాడిన' చందంగా ప్రభుత్వ వైఖరి ఉన్నదంటూ సర్కారుపై మండిపడుతున్నారు.

కర్ణాటకలోని కునిగల్‌లో కరెంటు లేకపోవడంతో టార్చిలైట్ వెలుతురులోనే అమృత్ యోజన పథకంపై ఎమ్మెల్యే రంగనాథ్ సమీక్ష

వెలుగుల బాట పట్టించిన ఘనత కేసీఆర్‌దే

తెలంగాణలో 24 గంటలపాటు నాణ్యమైన కరెంటును సరఫరా చేస్తుంటే.. 5 గంటల కరెంటు సరఫరాకే కాంగ్రెస్ సర్కారు ఆర్భాటపు ప్రకటనలు చేయడంపై పలువురు చురకలు అంటిస్తున్నారు. అధికారమిచ్చిన ఐదు నెలలకే కర్ణాటకను చీకటిపాలు చేసిన ఘనత కాంగ్రెస్‌దైతే.. సమైక్య పాలనలో చీకట్లో మగ్గిన తెలంగాణను కేవలం ఐదు నెలల్లోనే వెలుగులబాట పట్టించిన ఘనత కేసీఆర్‌దేనంటూ సోషల్‌మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. 'మొన్నటికి మొన్న.. ఒకడు (రేవంత్ రెడ్డి) ఎవుసానికి మూడు గంటల కరెంటు 'మస్తు.. పో' అన్నడు.. ఇప్పుడు.. '5 గంటల కరెంటు ఇస్తం. పండుగ చేస్కోండి' అన్నట్టు కర్ణాటక స్కాంగ్రెస్ సర్కారు గప్పాలకు పోతున్నదం'టూ విమర్శిస్తున్నారు. ఈ వ్యాఖ్యలను లోతుగా విశ్లేషిస్తే, నిజమేనని అర్థమవుతున్నది. కర్ణాటకలో అధికారంచేపట్టిన కాంగ్రెస్ కేవలం ఐదు నెలల్లోనే రాష్ట్రాన్ని ఆగమాగం చేసింది. విద్యుత్తు కోతలతో అన్ని రంగాలను కుదేలయ్యేలా చేసింది. అయితే, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన ఐదారు నెలల్లోనే సీఎం కేసీఆర్ చీకట్లలో మగ్గిన రాష్ట్రాన్ని వెలుగుబాట పట్టించారు. గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు 24 గంటలపాటు నిరంతరాయ విద్యుత్తును అందించి దేశమే ఆశ్చర్యపోయేలా చేశారు. రాష్ట్రం ఏర్పడేనాటికి 2,700 మెగావాట్ల విద్యుత్తులోటు ఉండేది. పంటలు పండక, అప్పుల బాధతో రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యమయ్యేవి. ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టికేంద్రీకరించిన సీఎం.. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా దేవులపల్లి ప్రభాకర్‌రావును నియమిస్తూ జీవో నంబర్ 1 విడుదల చేశారు. మొట్టమొదటి సమీక్ష కూడా విద్యుత్తుపైనే. అలా విద్యుత్తు సరఫరా, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తూ కేవలం ఆరు నెలల్లోనే అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్తును సరఫరా చేసే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారు.

> **ఓటరన్నా..**
>
> మొన్న ఒకడు ఎవుసానికి మూడు గంటల కరెంటు 'మస్తు.. పో' అన్నడు.. ఇప్పుడు, '5 గంటల కరెంటు ఇస్తం. పండుగ చేస్కోండి' అన్నట్టు మాట్లాడుతుండ్రు.. స్కాంగ్రెస్‌కు ఓటేస్తే, ఏం జరుగుతుందో.. జెర అర్థమవుతుందాయే నీకు?!

2014 నుంచి విద్యుత్తు సంస్థల బలోపేతానికి కేసీఆర్ సర్కారు చేసిన ఖర్చు (రూ. కోట్లలో)

సంవత్సరం	ట్రాన్స్‌మిషన్‌లు	డిస్కంలు
2014-15	1,312.32	1,811
2015-16	1,731.05	2,396
2016-17	2,511.29	3,058
2017-18	2,985.79	2,526
2018-19	3,544.76	2,754
2019-20	2,123.05	1,898
2020-21	1,891.94	1,606
2021-22	2,174.88	1,856
2022-23	1,678.31	1,434
2023-24 (ఏప్రిల్ 30నాటికి)	28.75	
మొత్తం	19,982.14	19,338.57

విద్యుత్తు సంస్థల బలోపేతానికి 9 ఏండ్లలో తెలంగాణ సర్కారు చేసిన ఖర్చు 39,320.71 కోట్లు

చార్‌ధామ్ యాత్ర @ 50 లక్షలు

ఈ ఏడాది యాత్రలో పాల్గొన్న సందర్శకులు

డెహ్రాడూన్: చార్‌ధామ్ యాత్రలో ఈసారి కొత్త రికార్డు నమోదైంది. ఇంతకుమునుపెన్నడూ లేని విధంగా చార్‌ధామ్ యాత్రలో పాల్గొన్న వారి సంఖ్య 50 లక్షలు దాటింది. ఉత్తరాఖండ్‌లోని హిమాలయ పర్వతాల్లో దేవభూమిగా పిలిచే బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి దేవాలయాలను సందర్శించడాన్నే చార్‌ధామ్ యాత్ర అంటారు. ఈ నాలుగు క్షేత్రాలను ఈ ఏడాది 50 లక్షల మందికి పైగా దర్శించుకున్నారని అధికారులు ప్రకటించారు. పోలీస్ రికార్డుల ప్రకారం ఈ ఏడాది అక్టోబర్ 16 నాటికి ఈ సంఖ్య నమోదైందన్నారు.

గాజా దవాఖానపై దాడి

500 మంది మృతి

- బాంబులతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్ సైన్యం
- దక్షిణ గాజాపైనా బాంబు దాడులు
- నేడు ఇజ్రాయెల్‌లో బైడెన్ పర్యటన

గాజా సిటీ/జెరూసలేం, అక్టోబర్ 17: గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడులను మరింత తీవ్రతరం చేసింది. సెంట్రల్ గాజాలోని ఓ దవాఖానపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో కనీసం 500 మంది వరకు మృతి చెందినట్టు హమాస్ మంగళవారం వెల్లడించింది. మరోవైపు ఇజ్రాయెల్ సైన్యం ఆదేశాలతో లక్షలాది మంది పాలస్తీనియన్లు ఉత్తర గాజా నుంచి దక్షిణ ప్రాంతానికి వెళ్లిపోతున్నారు. వేలాది మంది గాజా నుంచి బయటపడేందుకు ఈజిప్టుతో సరిహద్దు పంచుకొనే రఫా పట్టణానికి చేరుకొంటున్నారు. ఈ క్రమంలో పాలస్తీనియన్లు ఆశ్రయం పొందుతున్న ఖాన్ యూనిస్, రఫాలపై కూడా ఇజ్రాయెల్ భారీగా బాంబుదాడులకు పాల్పడిందని స్థానిక అధికారులు పేర్కొన్నారు. 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తున్నది. హమాస్ స్థావరాల, సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

లెబనాన్ సరిహద్దుల్లో దాడులు

ఇజ్రాయెల్, లెబనాన్ సరిహద్దుల్లో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తాయి. లెబనాన్ భూభాగం నుంచి ప్రయోగించిన యాంటీ ట్యాంక్ క్షిపణి ఇజ్రాయెల్‌లోని సరిహద్దు పట్టణం మెటులాలో పడింది. హెజ్బొల్లా గ్రూపు దీన్ని ప్రయోగించి ఉంటుందని ఇజ్రాయెల్ వర్గాలు పేర్కొన్నారు. ప్రతిగా ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్ సరిహద్దు ప్రాంతాలపై ఆర్టిలరీ షెల్లింగ్, ఫాస్ఫరస్ దాడులు చేసిందని లెబనాన్ ప్రభుత్వ వార్తా సంస్థ నివేదించింది.

నేడు అరబ్ నేతలతో బైడెన్ భేటీ

హమాస్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు మద్దతు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ బుధవారం ఆ దేశంలో పర్యటిస్తారని యూఎస్ విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ప్రకటించారు. ఇజ్రాయెల్ పర్యటన తర్వాత బైడెన్ జోర్డాన్ వెళ్లాడని, అక్కడ అరబ్ నేతలతో సమావేశం అవుతారని వైట్‌హౌస్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అధికార ప్రతినిధి జాన్ కిర్బి వెల్లడించారు.

సిద్ధంగా ఉండండి..

మరోవైపు ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం నేపథ్యంలో అమెరికా తన బలగాలకు కీలక ఆదేశాలు జారీచేసినట్టు తెలుస్తున్నది. యుద్ధంపై స్పందించేందుకు మోహరింపునకు సిద్ధంగా ఉండాలంటూ రక్షణ శాఖ దాదాపు 2 వేల మంది సైనికులకు ఆదేశాలు ఇచ్చినట్టు సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి.